అడుగడుగునా అడ్డంకులు

కోవూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా కోవూరు ప్రాంతం నుంచి నెల్లూరు వెళ్లే రహదారుల్లో పోలీసులు అడుగడుగునా చెక్‌పోస్టులు పెట్టారు. గురువారం తెల్లవారుజాము నుంచి కోవూరులోని సాలుచింతల సెంటర్, జాకీర్‌సా మిల్లు, ఇనమడుగు సెంటర్, కొడవలూరు సమీపంలో ఉన్న రామన్నపాళెం గేట్, బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన జొన్నవాడ సెంటర్, ఇందుకూరుపేట పరిధిలో ఆరో మైల్ దగ్గర పోలీసులు ప్రతిఒక్కరినీ తనిఖీలు చేశారు.

భారీగా తరలిన అభిమానులు

పోలీసులు ఎన్ని చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా పెద్ద సంఖ్యలో అభిమానులు వాహనాలు, బైక్‌లపై, పాదయాత్రగా నెల్లూరుకు తరలివెళ్లారు. జగన్‌ను చూడాలని, ఆత్మీయంగా స్వాగతం పలకాలని కోవూరు, ఇందుకూరుపేట, బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు, కొడవలూరు తదితర మండలాల నుంచి యువత, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో కదిలారు. పోలీసులు బారికేడ్లను పెట్టి ఆపే ప్రయత్నం చేసినా, 'జగన్‌ను చూడాలి', 'జగన్ జిందాబాద్' నినాదాలు చేస్తూ అభిమానులు ముందుకు పరుగులు తీశారు. కొందరు మహిళలు పాదయాత్రగా, కొందరు యువకులు బైకులపై జెండాలు ఊపుతూ ర్యాలీగా వచ్చారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు జగన్‌పై ఉన్న అభిమానాన్ని చూపిస్తూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీసుల గుప్పెట్లో రహదారులు

కొడవలూరు: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన నేపథ్యంలో మండలంలోని ప్రధాన రహదారులను గురువారం పోలీసులు గుప్పెట్లోకి తీసుకున్నారు. నార్తురాజుపాళెం కూడలి, టపాతోపు క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు భారీగా మోహరించారు. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు ప్రజలెవరూ వెళ్లకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా వ్యవహరించారు. ఆటోలు, కార్లు, పాఠశాలల బస్సులు ఇలా ఏ ఒక్కదాన్ని వదలకుండా తనిఖీ చేశారు. ఆటోలలో రోజువారీ పనులకు వెళ్లేవారు, కార్లలో సొంత పనులపై వెళ్లేవారు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల బస్సులను సైతం వదలకుండా తనిఖీలు చేపట్టడంతో వారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. విడవలూరు, అల్లూరు మండలాల ప్రజలు నార్తురాజుపాళెం, టపాతోపుల మీదుగా వస్తారు. వీరి వాహనాలను కూడా ఆపి తనిఖీల పేరుతో నిలిపివేయడంతో ఇబ్బంది పడ్డారు.

బుచ్చిరెడ్డిపాళెంలోని జొన్నవాడ సర్కిల్ వద్ద..



కోవూరు సాలుచింతల సెంటర్ వద్ద..



కొడవలూరు: టపాతోపు క్రాస్‌రోడ్డు వద్ద కూలి పనులకు వెళ్తున్న ఆటోను తనిఖీ చేస్తున్న పోలీసులు





కొడవలూరు: నార్తురాజుపాళెంలో పాఠశాల బస్సును సైతం తనిఖీ చేస్తున్న పోలీసులు

ఉప్పొంగిన అభిమానం

- అడ్డదారులు, పొలాల మీదుగా నెల్లూరుకు..
- లాఠీచార్జ్‌లో పార్లపల్లి యువకుడికి గాయం

పొదలకూరు: వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గ శ్రేణుల అభిమానం ఉప్పొంగింది. పోలీస్ అడ్డంకులను అధిగమించి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు వివిధ మార్గాల ద్వారా నెల్లూరుకు చేరుకున్నారు. గురువారం ఉదయం 6 గంటల నుంచే పార్టీ నాయకులు, కార్యకర్తలు మోటార్‌బైక్‌లు, ఇతర వాహనాల్లో వెళ్లి జిల్లా జైలుకు సమీపంలో గుమిగూడారు. అయితే పోలీసులు తెల్లవారుజాము నుంచే అన్ని మార్గాల్లో బ్యారికేడ్లు ఏర్పాటు చేసి సోదాలు నిర్వహించారు. ఎవరినీ వదలకుండా ప్రతి వాహనాన్ని సోదా చేసి పంపించారు. జగన్ పర్యటనకు హాజరవుతున్నట్టు అనుమానిస్తే వెనక్కు పంపించారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల కార్యకర్తలు ముఖ్యంగా యువకులు వివిధ మార్గాల ద్వారా పోలీసుల కంటపడకుండా వెళ్లారు.

అటవీ మార్గం గుండా..

పొదలకూరు – నెల్లూరు మార్గం రూరల్ మండలం మట్టెంపాడు వద్ద పొదలకూరు పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. బిరదవోలు పంచాయతీకి చెందిన నాయకులు, కార్యకర్తలు అటవీ మార్గం గుండా జిల్లా జైలుకు సమీపంలో వేచి ఉండి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో పాల్గొన్నారు. వెంకటాచలం మండలానికి చెందిన వారు హెలిప్యాడ్ వద్దకు చేరుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు చెదరగొట్టారు. అయితే వీరంతా హైవేపై ఉండి మాజీ సీఎంను అనుసరించారు. జిల్లా జైలు వద్ద పోలీసు లాఠీచార్జ్‌లో పొదలకూరు మండలం పార్లపల్లికు చెందిన శివారెడ్డి అనే యువకుడి చేతి వేలు చిట్లింది. బుధవారం పోలీసులు నేతలకు నోటీసులను జారీ చేశారు. అయితే నాయకులు, కార్యకర్తలు జగన్‌పై అభిమానంతో ఆయన్ను చూసేందుకు వెళ్లారు.

యువకుల్లో ఉత్సాహం

ఎన్ని రకాల ఆంక్షలున్నా యువకులు తెల్లవారుజాము నుంచే గమ్యస్థానాలకు చేరుకున్నారు. లాఠీచార్జ్‌ను సైతం లెక్కచేయకుండా జై జగన్ అంటూ నినాదాలు చేశారు. జిల్లా జైలులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్ అయిన జగన్ రోడ్డు మార్గాన నెల్లూరుకు వెళ్లే సమయంలో యువకులను అదుపు చేయడం పోలీసుల వల్ల కాలేదు.



చెముడుగుంట పంచాయతీ జాతీయ రహదారిపై నేతలు, అభిమానులు

భారీగా నెల్లూరుకు తరలిన అభిమానులు

తోటపల్లిగూడూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానం ముందు పోలీస్ ఆంక్షలు తుస్సుమన్నాయి. గురువారం తెల్లవారుజాము నుంచి మండలంలోని అనేక కూడళ్లలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జగన్ పర్యటనకు వెళ్తున్న వారిని వెనక్కి పంపే ప్రయత్నం చేశారు. చివరికి కాలేజీలకు వెళ్లే విద్యార్థులను, ఇతర అవసరాల కోసం నెల్లూరుకు వెళ్లే వారిని కూడా పోలీసులు ఇబ్బందులు పెట్టారు. అయినా మండలంలో నుంచి పెద్ద సంఖ్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జగన్‌ను చూసేందుకు ఇతర మార్గాల ద్వారా వెళ్లారు.

➡ మనుబోలు: హైవేపై బుధవారం భారీగా పోలీసులను మోహరించారు. జగన్‌ను చూసేందుకు స్వచ్ఛందంగా వెళ్లేవారిని తనిఖీల పేరుతో ఇబ్బంది పెట్టారు. ప్రభుత్వ తీరుపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ధాన్యం కొనడం లేదు.. జగనన్నకు చెబుదామని వచ్చాం



ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో కొనేవారు లేరు. 860 కిలోల షుగర్ లెస్ ధాన్యం జగనన్న హయాంలో రూ.29 వేల అమ్మాం. ఇప్పుడు రూ.22 వేలకు కూడా కొనే దిక్కులేదు. వేలాది క్వింటాళ్ల ధాన్యం సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని రైతుల వద్ద ఉంది. రైతుల సమస్యను చంద్రబాబు ప్రభుత్వం గాలికి వదిలేసింది. మా సమస్యలను జగనన్నకు చెబుదామని వచ్చాం.

– పాముల హరినాథ్, గుడ్లూరివారిపాళెం, సర్వేపల్లి నియోజకవర్గం



జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరాకుండా పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. బుధవారం రాత్రి నుంచే నగరంలో అష్టదిగ్బంధం విధించి ప్రజలు ఒకచోట చేరకుండా అనేక ప్రయత్నాలు చేశారు. అయినా ప్రజలు ఉప్పొంగిన అభిమానంతో పోలీసుల ఆంక్షలను ఛేదించి జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. 'జై జగన్.. కాబోయే సీఎం జగనన్న' అంటూ నినాదాలు హోరెత్తించారు.









పొదలకూరు - నెల్లూరు మార్గంలో తెల్లవారుజామున చెక్‌పోస్టు వద్ద పోలీసులు



పొలిచెర్లపాడు అటవీ మార్గంలో నడిచి వెళుతున్న కార్యకర్తలు



అడ్డదారిలో మోటార్‌బైక్‌పై వెళ్తూ..



టీపీగూడూరు : నరుకూరు సెంటర్‌లో అడ్డుకుంటున్న పోలీసులు



మనుబోలు: హైవేపై పోలీసులు



జిల్లా జైలుకు సమీపంలో కాలనీ వద్ద జగన్ కోసం వేచి ఉన్నారిలా..

క్లుప్తంగా

జట్ల కొండూరులో పొలం పిలుస్తోంది



మనుబోలు: మండలంలోని జట్ల కొండూరు గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకంలో నియంత్రణ పాటించాలన్నారు. యూరియా ఎక్కువగా వాడటం వల్ల వరిలో పురుగులు, తెగుళ్ల ఎక్కువయ్యే ప్రమాదం ఉందన్నారు.

నేషనల్ మానిటరింగ్ టీమ్ పరిశీలన



ఇందుకూరుపేట: నేషనల్ లెవల్ మానిటరింగ్ టీమ్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. తొలుత కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై కొత్తూరులో ప్రజలతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఇందుకూరుపేటలో అరటి వ్యర్థాల నుంచి ఉప ఉత్పత్తుల తయారీ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని, పలు అంశాలపై పరిశీలించారు. బృంద సభ్యులు ప్రశాంత్‌కుమార్, మణికండన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ నేడు

పొదలకూరు: కొత్తగా మంజూరైన (వితంతు) పింఛన్లను స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ డీవీ నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

అమ్మవారికి అభిషేకం

పొదలకూరు: శ్రావణమాస రెండో శుక్రవారం సందర్భంగా స్థానిక శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం 9 గంటలకు అమ్మవారికి డ్రైఫ్రూట్స్‌తో అభిషేకం చేస్తామని నిర్వాహకులు గురువారం తెలిపారు. ఉభయకర్తలుగా లక్ష్మీనారాయణ – లక్ష్మి దంపతులు వ్యవహరిస్తారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

డీసీపల్లిలో 251 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 251 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 488 బేళ్లు రాగా 251 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.159, సగటున రూ.217.44 ధర పలికిందని వివరించారు. వేలంలో పది కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

2 నుంచి 5వ తేదీ వరకు పాలిసెట్ స్పాట్ అడ్మిషన్లు

కావలి(జలదంకి): కావలి మండలం రుద్రకోటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు పాలిసెట్–2025 స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని ఆ కళాశాల ప్రిన్సిపల్ సుశీల్‌కుమార్‌ప్రియ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఈఈఈ, సివిల్ ఇంజినీరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. స్పాట్ అడ్మిషన్లు పొందేందుకు పదోతరగతి ఉత్తీర్ణులైన, ఇంటర్మీడియట్ తప్పిన, పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోని వారు కూడా అర్హులని తెలిపారు. అడ్మిషన్ కోసం వచ్చే అభ్యర్థులు పదో తరగతి మార్కుల జాబితా, టీసీ, కులం సర్టిఫికెట్లు, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, పాలిసెట్ రాసి ఉంటే ర్యాంకు కార్డులతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్లకు ఫీజురీయింబర్స్‌మెంట్ వర్తించదని, ఫీజు రూ.5,800 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- ఒకరికి గాయాలు

జలదంకి: స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో గురువారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొనడంతో ఒకరు గాయాలపాలయ్యారు. వివరాలు.. కలిగిరి మండలం కాకుటూరుకు చెందిన షేక్ కబీర్ తన తండ్రి ఇమామ్ ఖాసీంతో కలిసి ఇంటి శంకుస్థాపనకు సంబంధించిన వస్తువులను కొనుగోలు చేసేందుకు మోటార్‌బైక్‌పై కావలికి వెళ్తూ పెట్రోల్ పట్టించుకునేందుకు జలదంకి పెట్రోల్ బంకు వద్ద రోడ్డును క్రాస్‌చేస్తున్నారు. అలాగే తిరుపతికి చెందిన ఎరువుల కంపెనీ ఉద్యోగులు అద్దె కారులో జమ్మలపాళెంలో జరిగిన ఓ వివాహానికి హాజరయ్యారు. అనంతరం జలదంకిలోని వ్యాపారులను కలుసుకునేందుకు కారులో వస్తూ కబీర్ మోటార్‌సైకిల్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కబీర్‌కు గాయాలయ్యాయి. తండ్రి ఖాసీం సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. జలదంకి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంగ్ల బోధన శిక్షణకు పాటూరు టీచర్

కోవూరు: బెంగళూరులో రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ ఆధ్వర్యంలో దక్షిణ భారత స్థాయిలో ఈనెల 1వ తేదీ నుంచి నెలరోజుల పాటు నిర్వహించనున్న ఆంగ్ల బోధన శిక్షణకు పాటూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని జాలాది కేశవర్ధిని ఎంపికయ్యారని హెచ్‌ఎం జుల్ఫికర్ అలీ తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన పాఠ్య పుస్తకాల మేరకు ఆంగ్ల బోధనను మరింత సృజనాత్మకంగా, సమర్థవంతంగా చేపట్టే విధానాలు, బోధనా పద్ధతులు వంటి అంశాలపై ఈ శిక్షణలో దృష్టి పెట్టనున్నారు. ఈ శిక్షణకు జిల్లా నుంచి ఏకైక ఉపాధ్యాయినిగా కేశవర్ధిని ఎంపిక కావడం విశేషం. ఈ క్రమంలో ఆమెను ఉపాధ్యాయులు చంద్రమోహన్, ఉమామహేశ్వరి, విజయకుమారి, సతాజ్, అరుణ, శేషయ్య, వల్లిబాషా, కృష్ణమోహన్, సీనమ్మ తదితరులు గురువారం అభినందించారు.



ఉపాధ్యాయినికి అభినందన

గిరిజనుల సంక్షేమానికి కృషి

- తహసీల్దార్ స్ఫూర్తి రెడ్డి

కొడవలూరు: గిరిజనుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, ఈ క్రమంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి తెలిపారు. మండలంలోని గుండాలమ్మపాళెం గాంధీ గిరిజన కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్, స్వయం ఉపాధి రుణాలు, 35 కిలోల ఉచిత బియ్యం ఇలా అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. ప్రతిఒక్కరూ విధిగా ఆధార్ కార్డు కలిగి ఉండడం ద్వారా వీటిని పొందవచ్చన్నారు. గ్రామంలో నిర్వహించే పౌర హక్కుల దినోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.వసంతకుమారి, హౌసింగ్ ఏఈ ముక్తార్‌బాషా, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఆర్‌ఐ హైమావతి, వీఆర్వో బాబు, స్థానిక నాయకుడు అమరేంద్రరెడ్డి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ స్ఫూర్తి రెడ్డి

లారీ తగిలి టోల్‌బూత్ ధ్వంసం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి టోల్ ప్లాజాలోని టోల్‌బూత్ లారీ తగలడంతో గురువారం ధ్వంసమైంది. టోల్‌బూత్‌లో సిబ్బంది లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. గత నెల రోజుల వ్యవధిలో వాహనాలు తగిలి టోల్‌బూత్‌లు ధ్వంసం కావడం ఇది మూడోసారి. ఇక్కడ టోల్‌బూత్‌లు ఇరుకుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా టోల్‌ప్లాజా నిర్వాహకులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దేవుని మాన్యంలో తవ్వకాలు

చేజర్ల(సోమశిల): చేజర్ల మండలం కాకివాయిలోని కోటితీర్థం త్రికోటేశ్వరస్వామి ఆలయానికి చెందిన సుమారు 40 ఎకరాల భూమిని జీకే ల్యాండ్స్ ప్రైవేట్ సంస్థ వారు లీజుకు తీసుకున్నారు. దేవుని మాన్యాన్ని పొడుకున్నవారు పంటలు సాగులు చేసుకోవాలి. కానీ భూముల్లో ఇష్టానుసారంగా భారీ గుంతలు తవ్వడంపై గ్రామస్తులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ మాన్యంలో ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతున్నారని, సంబంధిత అధికారులు పరిశీలించి తవ్వకాలను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కొడవలూరు: మండలంలోని రెడ్డిపాళెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి నాగరాజు మాట్లాడుతూ కాలానుగుణంగా వచ్చే వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు దోమలు కుట్టకుండా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వలు, చెత్తా చెదారాలు లేకుండా చూసుకోవడంతో పాటు నిల్వ ఉన్న ఆహారాన్ని తీసుకోకూడదన్నారు. అదేవిధంగా ఇంట్లోని తొట్టెలు, ఇతరత్రా పాత్రల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఏ షఫీ ఉద్దీన్, ఏఎన్‌ఎం నదియ, ఎంఎల్‌హెచ్‌పీ సుష్మ, ఆశా కార్యకర్తలు పద్మ, కిశోరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నూరుశాతం ఉపాధి లక్ష్యాలను సాధించాలి

- డ్వామా పీడీ గంగాభవాని

ఉదయగిరి రూరల్/ఆత్మకూరురూరల్: ఉదయగిరి క్లస్టర్ పరిధిలోని ఉపాధి సిబ్బంది వారికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలని డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. ఉదయగిరిలోని స్త్రీశక్తి భవనంలో క్లస్టర్ పరిధిలోని ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. మండలాల వారీగా ఉపాధి పనుల పురోగతిపై ఏపీఓలు సిబ్బందితో పీడీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో కనీసం వంద సోక్‌పిట్‌లను నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఆగస్టు చివరి నాటికి 90 శాతం నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 3,500 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 1,700 ఎకరాల్లో సాగుకు రైతులను గుర్తించడం జరిగిందన్నారు. మెట్టప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకుని మరో వేయి ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకుని రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు రెండు వేల గోకులం షెడ్లు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో లబ్ధిదారులను ఎంపిక చేసి నిర్మాణాలను త్వరితగతిన చేపడతామన్నారు. ఉపాధి పనుల్లో బినామీ మస్టర్లను అరికట్టేందుకు ఆగస్టు 10వ తేదీ తరువాత కూలీలకు రెండుపూట్ల ముఖహాజరును తప్పనిసరి చేస్తున్నామన్నారు.